క్లుప్తంగా

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి



పాన్‌గల్: ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచేలా సిబ్బంది కృషి చేయాలని ఏపీఓ కుర్మయ్య అన్నారు. బుధవారం మండలంలోని కేతేపల్లిలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల వద్ద కూలీలకు నిబంధనల మేరకు వసతులను కల్పించాలని, రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అంతకుముందు నర్సరీని పరిశీలించి నర్సరీలో మొక్కలు ఎండకుండా వాటర్ క్యూరింగ్ చేయాలన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లిలో ఉపాధి హామీ నిధులతో నిర్మించే సీసీ రోడ్ల పనులను బుధవారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రాములు యాదవ్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో నిర్మించే సీసీ రోడ్డు పనులను నాణ్యవంతంగా చేపట్టి, క్యూరింగ్ చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, కురుమన్న, వెంకటేష్ సాగర్, బుక్కలయ్య, రామ్‌చందర్ ఉన్నారు.

ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి

పాన్‌గల్: ప్రతి విద్యార్థి సైన్స్‌పై ఆసక్తి పెంచుకొని గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని.. ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని విజ్ఞాన దర్శిని రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు జితేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో ఉన్న లిటిల్‌స్టార్ ఉన్నత పాఠశాలలో 'సైన్స్ నా ఊపిరి' అనే అంశంపై నిర్వహించిన వైజ్ఞానిక సదస్సుకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. తరగతి గది నుంచే ప్రయోగాలు ప్రారంభిస్తే విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెరుగుతుందన్నారు. సమాజంలోని మూఢనమ్మకాలను పారద్రోలేందుకు, విజ్ఞాన సమాజ నిర్మాణానికి విద్యార్థులు తమవంతు పాత్ర పోషించాలని సూచించారు. సైన్స్ ప్రపంచానికి గుండెలాంటిదని.. ఎందరో శాస్త్రవేత్తల త్యాగ ఫలమే నేడు మనం అనుభవిస్తున్న టెక్నాలజీ అని ట్రస్మా జిల్లా నాయకుడు రామకృష్ణారెడ్డి అన్నారు. విస్వజన కళామండలి జాతీయ ఉపాధ్యక్షుడు ఆడంరాజు మూఢ నమ్మకాలు, సైన్స్ మ్యాజిక్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శేఖర్ యాదవ్, కరస్పాండెంట్ ఆంజనేయులు, జానపద కళాకారుల సంఘం జిల్లా నాయకుడు డప్పుస్వామి, కళాకారుడు పామునాగులు, దళిత ఉద్యమ నాయకులు మీసాల రాము తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

గోపాల్‌పేట: ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో మహిళకు గాయాలైన ఘటన మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంకు ఎదుట జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాన్‌గల్‌కు చెందిన పద్మ పుట్టింటిల్లు ఏదుట్ల గ్రామం కావడంతో గతంలో ఆమె ఏపీజీవీబీ బ్యాంకులో అకౌంట్ తీసుకుంది. దీంతో అకౌంట్‌లో డబ్బులు తీసుకునేందుకు బుధవారం బ్యాంకుకు వచ్చింది. బ్యాంకు ఎదుట రోడ్డు దాటుతుండగా ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వేగంగా వచ్చి పద్మను ఢీకొట్టారు. దీంతో ఆమె తల, చేతులకు గాయాలయ్యాయి. ద్విచక్రవాహనం సైతం కింద పడిపోవడంతో యువకులు ఇద్దరికి గాయపడ్డారు. వెంటనే సమాచారం అందుకుని అక్కడికి చేరుకున్న ఎస్‌ఐ హరిప్రసాద్ పద్మను వనపర్తి ఆస్పత్రికి, యువకులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్, జేసీబీ పట్టివేత

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వెల్టూర్ శివారులోని చిలుకటోనిపల్లి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే ప్రాథమిక సమాచారం మేరకు రెవెన్యూ అధికారి తిరుపతయ్య సిబ్బందితో కలిసి వాగు దగ్గరకు చేరుకున్నారు. ఇసుకను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న జేసీబీని, ట్రాక్టర్‌ను పట్టుకుని పెద్దమందడి పోలీసులకు అప్పగించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

పాన్‌గల్: పొలం ఆక్రమణ విషయంలో జరిగిన ఘర్షణలో ముగ్గురిపై కేసు నమోదైన ఘటన బుధవారం పాన్‌గల్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మంగ్లపల్లికి చెందిన దొడ్ల వెంకట్‌రెడ్డికి సర్వేనం.99లో 4 ఎకరాల భూమి ఉంది. పక్కనే ఉన్న సంగనమోని కుర్మయ్య 20 గుంటల పొలాన్ని ఆక్రమించుకున్నాడు. ఈ విషయంలో పొలం వద్ద కుర్మయ్య, అతడి భార్య సుభద్ర, కొడుకు మద్దిలేటి ముగ్గురు కలిసి పరుశ పదజాలంతో దూషిస్తూ కట్టెలతో వెంకట్‌రెడ్డిపై దాడి చేశారు. ఘటనలో వెంకట్‌రెడ్డి కాళ్లు, ఎడమ చేతికి గాయాలయ్యాయి. దాడికి కారణమైన ముగ్గురిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ వెంకట్‌రెడ్డి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దంతనూరుకు 'సుస్తీ' చేసింది



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మదనాపురం: మండలంలోని దంతనూరులో మూడు రోజులుగా గ్రామస్తులు కీళ్ల వాపులు, కాళ్ల నొప్పులు, జ్వరంతో అల్లాడుతున్నారు. 150 మందికి పైగా ఈ రోగాల బారిన పడ్డారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

అధికారుల పరిశీలన

గ్రామంలో జ్వరాలు ప్రబలుతున్నాయన్న సమాచారం తెలియడంతో తహసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీఓ చెన్నమ్మ ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామంలో పర్యటిస్తూ ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. ప్రతి వీధికి వెళ్లి పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు సూచించారు. మురుగు కాల్వల్లో ఉన్న చెత్తాచెదారం తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులతో చర్యలు చేపట్టారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

వైద్య శిబిరం ఏర్పాటు

జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎంతమందికి జ్వరాలు ఉన్నాయి. కీళ్ల వాపులు, నొప్పులు తదితర వాటి వివరాలను సేకరించారు. రక్త నమూనాలను తీసుకున్నారు. చికెన్ గున్యా తదితర వ్యాధి లక్షణాలు ఉన్నాయని వైద్యురాలు భవాని చెబుతున్నారు.

అడిషనల్ కలెక్టర్ సూచనలతో..



గ్రామంలో జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారన్న విషయం పంచాయతీ కార్యదర్శి ద్వారా తెలిసింది. తక్షణమే అడిషనల్ కలెక్టర్‌కు విషయం విన్నవించాను. వారు తక్షణమే జిల్లా వైద్య అధికారికి వైద్య సేవలు అందిచాలని ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది సాయంతో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశాం. ప్రజలు ఎలాంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు.

– చెన్నమ్మ, ఎంపీడీఓ, మదనాపురం

జ్వరం బారిన పడ్డాం



నొప్పులు, జ్వరంతో అల్లాడుతున్నాం. రెండు రోజులుగా బాధ తీవ్రంగా ఉంది. చాలా మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి బాధ ఎప్పుడు రాలేదు. నడవడానికి కూడా శక్తి చాలట్లేదు.

– ఉప్పరి బాలకిష్టమ్మ, బాధితురాలు, దంతనూరు

51 రక్త నమూనాలు సేకరించాం



గ్రామంలో 150 మందికి పైగా జ్వరం, కీళ్ల నొప్పులు, వాపులతో ఇబ్బంది పడుతున్నారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి 51 మంది నుంచి రక్త నమూనాలు స్వీకరించాం. త్వరలో రిపోర్ట్ వస్తుంది. ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలించాం. చికెన్ గున్యా లక్షణాలు కనబడుతున్నాయి. పారాసెటమాల్ డైక్లో క్యాల్షియం బి కాంప్లెక్స్ యాంటిబయాటిక్ అవసరమైన వారికి ఇంజక్షన్లు ఇచ్చాం. అందరూ కోలుకునే వరకు శిబిరం కొనసాగిస్తాం.

– డాక్టర్ భవాని, పిహెచ్‌సీ, మదనాపురం

రామస్వామి స్మారక స్తూపం ఆవిష్కరణ



రామస్వామి స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: రామస్వామి 5వ వర్ధంతి సందర్భంగా స్మారక స్తూపాన్ని సీపీఎం నాయకుడు గంధం మదన్ ఆధ్వర్యంలో జెర్రిపోతుల మైసమ్మ ఆలయ సమీపంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకుడు నాగేశ్వర్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పుట్టా ఆంజనేయులు మాట్లాడుతూ.. సీపీఎంలో సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల పక్షాన నిలిచిన నాయకులు చిరస్థాయిగా ప్రజలు గుర్తించుకునేందుకు స్తూప నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్ తరాలు స్మారక స్తూపాల ద్వారా ప్రజల పక్షాన నిలిచిన నాయకుల గురించి, వారు చేసిన సేవల గురించి తెలుసుకుంటారని ఆకాంక్షించారు. అనంతరం స్మారక స్తూపం వద్ద రామస్వామి చిత్రపటానికి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి కమ్యూనిస్ట్ నాయకులు, భవన నిర్మాణ, ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో చింతకుంట పులయ్య, పట్టణ కార్యదర్శి కురమయ్య, బాలరాజు, పుల్లయ్య, రాబర్ట్, గోర్ల భాస్కర్, మన్యం, జీటీ బాలస్వామి, జీటీ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 21వ వార్డుకు చెందిన నందిమల్ల నారమ్మ బుధవారం మృతి చెందడంతో స్థానిక కౌన్సిలర్ వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే మేఘారెడ్డికి సమాచారం ఇచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే రూ. 5వేల ఆర్థికసాయం అందించారు. ఈ మేరకు బుధవారం నియోజకవర్గ సమన్వయ కర్త సతీష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్‌లు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి నగదును అందించారు. కార్యక్రమంలో కృష్ణ బాబు, వెంకటేష్, బొంబాయి మన్నెంకొండ, బాలస్వామి, సురేష్ తదితరులు ఉన్నారు.

వీపనగండ్ల: మండలంలోని పుల్గర్‌చర్లలో అనారోగ్యంతో మృతిచెందిన కొయ్య బాలస్వామి కుటుంబానికి అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎద్దుల సురేందర్‌రెడ్డి రూ.5వేల ఆర్థిక సాయంతో పాటు 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, మాణిక్యం రెడ్డి, కోదండం యాదవ్, నరేందర్‌రెడ్డి, విష్ణు, జనార్దన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని తోమాలపల్లి మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వారి గ్రామంలో బుధవారం ఆయనను పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. దయాకర్‌రెడ్డి, వెంకటేష్‌సాగర్, బీరం రాజశేఖర్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



తోమాలపల్లి మాజీ సర్పంచ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

కదుకుంట్లలో..

మండలంలోని కదుకుంట్లకు చెందిన మిద్దె వసంత అనారోగ్యంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏర్వ సాయిప్రసాద్ స్పందించి మృతురాలి కుమారుడికి బుధవారం రూ.5 వేలు నగదు, క్వింటాల్ బియ్యం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గజ్జల గోవర్ధన్, విష్ణు, శివయాదవ్, నితిన్, శివకుమార్‌సాగర్ పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించండి



ఆత్మకూర్: ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ నాగరాజు అన్నారు. బుధవారం సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేశారు. మున్సిపాలిటీలో రూ. 80 లక్షలకు పైగా పన్నుల బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లించాలని కోరారు. పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

ముగిసిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు



ఖిల్లాఘనపురం: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ఫిబ్రవరి 28న ప్రారంభమై బుధవారంతో ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాధ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రథమ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు నిర్వహించారు. 183 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. 175 మంది పరీక్ష రాశారు.

కూలీలకు పెండింగ్ డబ్బులు చెల్లించాలి



మాట్లాడుతున్న మేకల ఆంజనేయులు

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లులో బుధవారం ఉపాధి పనుల ప్రదేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు కూలీల సమస్యలు తెలుసుకున్నారు. గతేడాది చేసిన పనులకు పెండింగ్ కూలి డబ్బులు చెల్లించాలి, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రతి జాబ్ కార్డుకు 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.272 నుంచి రూ.600 కూలీ పెంచాలని పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలని కోరారు. పెండింగ్ కూలీ డబ్బులు ఇవ్వకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకట్రాములు, చెన్నయ్య, మొగిలి, సత్యనారాయణ, కూలీలు పార్వతి, శిల్ప, వినోద్, పద్మ, పారిజాత, కురుమూర్తి, వెంకటేష్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మున్సిపల్ కార్మికుడి మృతి

అమరచింత: మున్సిపల్ కార్యాలయంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న కార్మికుడు నాగరాజ్ (49) బుధవారం తెల్లవారుజామున గెండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్.గోపి, కమిషనర్ నూరుల్ నజీబ్ నాగరాజు ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అంత్యక్రియల కోసం తక్షణ సాయంగా రూ.15 వేలల నగదును అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజ్‌కుమార్, మున్సిపల్ కార్మికులు ప్రభాకర్, ప్రేమ్ కుమార్, జిలాని, హరికృష్ణ, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

శంభో శంకర పాహిమాం



స్వామివారి పల్లకీసేవలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, భక్తులు



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరువులో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి జాతరలో భాగంగా బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో చివరి రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాది మంది భక్తులు భక్షాలు, పచ్చి పులుసు, అన్నాన్ని స్వామివారికి నైవేద్యంగా సమర్పించి దాసంగాలు పెట్టారు. రాత్రి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలుకొని పట్టణంలోని పుర వీధుల గుండా వేలాదిమంది భక్తులు స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం పల్లకీసేవను ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి రథోత్సవంపై విగ్రహాలు ఉంచి తేరు లాగారు. చివరి రోజు జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలిదిగా పాల్గొన్నారు.

ప్రముఖుల పూజలు

అనంతరం పూజారి కర్పసయ్య ఆధ్వర్యంలో ఎంపీపీ బంగారు శ్రీను, జెడ్పీటీసీ శివరంజని, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండోఅధ్యక్షుడు గాడికృష్ణమూర్తి, జాతర కమిటీ కన్వీనర్ రవికుమార్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు చెన్నయ్య, మండ్లరామకృష్ణ, పోషన్న, అశ్విన్‌కుమార్, మహేశ్వరి, నాగలక్ష్మి, యాదమ్మ, తబుస్సూం, రైతుసంఘం అధ్యక్షుడు వీరేశలింగం, వైస్‌ఎంపీపీ కోటేష్, వార్డు మాజీ సభ్యుడు గడ్డమీది శ్రీను ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

వీపనగండ్ల: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి విద్యలో రాణించే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం సంగినేనిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా విద్యార్థుల ప్రతిభను గుర్తించాలని, ఏప్రిల్‌లో నిర్వహించే పరీక్షల్లో ప్రతి ఒక్కరూ ఉత్తమంగా రాణించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలీశ్వరయ్య, నాగరాజు, ఉపాధ్యాయులు అరుణ, చెన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థుల భవిష్యత్‌కు పునాది



విద్యార్థులతో ఎంపీడీఓ, ఎంఈఓ, ఉపాధ్యాయ బృందం

సాక్షి, నెట్‌వర్క్: పదో తరగతి అనేది విద్యార్థుల జీవితాల్లో ఓ మైలు రాయి లాంటిదని, అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి బంగారు భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని ఎంఈఓలు సూచించారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షలు రాసే విధానంపై అవగాహన కల్పించారు. పరీక్ష సమయంలో ఒత్తిడి గురి కాకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణ గుప్త, జయరాములు, రాఘవేందర్, బలరాముడు, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎంఎస్ విజయకుమార్, వేణాచారి, రాంప్రసాద్ , గోవర్ధన్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, వరలక్ష్మి, ఇందిర, దేవన్న, పర్వీన్‌సుల్తానా, కృష్ణనాయక్, వెంకటేష్, శంకర్‌నాయక్, బాలు, శ్వేత, సీఆర్పీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



వీపనగండ్ల బాలుర ఉన్నత పాఠశాలలో..



అమరచింతలో..

గ్రామస్తుల సహకారంతోనే టీబీని నివారించాం



టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: వైద్యుల సూచనలను పాటిస్తూ గ్రామస్తులు సహకరించడంతోనే దావాజిపల్లి టీబీ రహిత గ్రామంగా ఎంపికైందని ఎంపీఓ రఘురాములు అన్నారు. బుధవారం గ్రామంలో జిల్లా టీబీ బృందం సభ్యులు, పీహెచ్‌సీ డాక్టర్ మైథిలి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 సంవత్సరంలో గ్రామంలో 56 మందికి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. అందులో ఇద్దరికి టీబీ ఉన్నట్లు తేలిందన్నారు. వారితో ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడించి రోగం నయం చేయించినట్లు పేర్కొన్నారు. గ్రామంలో టీబీ నోటిఫికేషన్ రెండు కంటే తక్కువ ఉన్న దృష్ట్యా గ్రామాన్ని టీబీ ఫ్రీ విలేజ్‌గా ప్రభుత్వం నిర్ధారించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ బృందం సభ్యుడు నగేష్, ప్రవీణ్, మండల ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను నిర్లక్ష్యం చేయొద్దు



మాట్లాడుతున్న ఏపీడీ సుల్తాన్

అమరచింత: ఉపాధిహామీ పనులను నిర్లక్ష్యం చేయొద్దని ఏపీడీ సుల్తాన్ ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి పనుల పురోగతిపై క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కేవలం ముళ్ల పొదల తొలగింపు పనులు మాత్రమే చేపడుతున్నారని.. దీంతో గ్రామాలకు కలిగే ప్రయోజనం శూన్యమన్నారు. కూలీల సంఖ్య పెంచాలని.. అప్పుడే ఉపాధితో పాటు నిధులు గ్రామాలకు మంజూరయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా సీసీ రహదారుల నిర్మాణాలు కొనసాగుతున్నాయని.. వీటితో పాటు పంటకాల్వల పూడికతీత, పొలాల చదును, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. కూలీల బ్యాంకు ఖాతాలు పనిచేయకుంటే.. పోస్టాఫీస్‌లలో ఖాతాలు తెరిపించి డబ్బులు అందించాలని సూచించారు. పలు గ్రామాల్లో నామమాత్రంగా పనులు కొనసాగుతున్నట్లు సమాచారం అందిందని.. వచ్చే వారం ఆకస్మికంగా తనిఖీ చేసి స్వయంగా పరిశీలించే అవకాశం ఉందని చెప్పారు. కోరుకున్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని.. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు సూచించారు. ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ నర్సింహులు, సాంకేతిక సహాయకుడు రఘు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబకు ఘన నివాళి



బుసిరెడ్డిపల్లిలో కవయిత్రి మొల్లకు నివాళులర్పిస్తున్న శాలివాహన సంఘం నాయకులు

వనపర్తి టౌన్: మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించాలని కుమ్మరి శాలివాన సంఘం అధ్యక్షుడు మన్నెంకొండ డిమాండ్ చేశారు. బుధవారం మొల్ల జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట మొల్ల చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, పరశురాం, నరసింహ, మన్యం, కొండన్న, వెంకటయ్య, రాము, వాసు, గిరిరాజాచారి, నాయకంటి నరసింహశర్మ, బాలస్వామి నాయుడు, బాలేమియా, సూగురి రాము, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బుసిరెడ్డిపల్లిలో..

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లిలో శాలివాహన(కుమ్మరి) సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్లమాంబ చిత్రపటానికి జిల్లా నాయకుడు సూర్యవంశ రాము పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కొండయ్య, రాముడు, చిన్నరాముడు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని గాంధీచౌరస్తాలో శాలివాహన యూత్ ఆధ్వర్యంలో కవయిత్రి మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, కంభాళాపురం ఎంపీటీసీ ఎల్లస్వామి, నాయకులు బక్కరాజు, గోవిందు, రామచందర్, మద్దిలేటి పాల్గొన్నారు.